



అమలాపురంలో బాలయోగి స్టేడియంలో బాణసంచా దుకాణాలు

వెలుగుల విరజిమ్మే **దీపావళి**
- నిర్లక్ష్యం చేస్తే చిమ్మ చీకటిని ఆహ్వానించినట్టే!
- ముందు జాగ్రత్తలు పాటించాలి 6

ఇంటింటి సర్వే నుంచి దివ్యాంగులకు మినహాయింపు
- ప్రకృతి విపత్తుల సమయంలో విధిగా హాజరు కావాలి 6
- గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు విధులు ఖరారు

కోరింగ రోప్‌వే బ్రిడ్జిని పరిశీలించిన ఎంపీ 6

అంతర్వేదిలో **రయ్ రయ్..**
- బీచ్‌లో ఏటీవీ బైకులు 7
- ఆనందం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు

కళ తప్పిన దుకాణాలు

- పెరిగిన ధరలతో వినియోగదారుల ఇక్కట్లు
- అల్పపీడనంతో ఆందోళన వ్యక్తం చేస్తున్న వ్యాపారులు
- జిల్లాలో 420కు పైగా బాణసంచా దుకాణాలు
- రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపకశాఖ ఆధ్వర్యంలో తనిఖీలు
- రాయవరం, విలస ఘటనలతో అలెర్ట్ అయిన అధికారులు



దుకాణాల వద్ద అగ్నిమాపక దళ అధికారి రాజా ఆధ్వర్యంలో ఏర్పాట్లు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

సోమవారం దీపావళి జరుపుకునేందుకు కోనసీమ జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ముందెన్నడూలేని రీతిలో జిల్లాలో ఇటీవల జరిగిన రెండు బాణసంచా పేలుళ్లలో 12మంది మృత్యువాత పడడంతో ఆ ప్రభావం బాణసంచా వ్యాపారులపై తీవ్రంగా చూపుతోంది. దీనికితోడు వివిధశాఖలకు చెందిన ప్రభుత్వ అధికారులు విధించిన సవాలక్ష ఆంక్షల నడుమ బాణసంచా విక్రయాలు జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో ఆదివారంనుంచి ప్రారంభమయ్యాయి. అల్పపీడన ప్రభావంతో వర్షాలు చెదురు మదురుగా పడుతుండడంతో బాణసంచా దుకాణాల నిర్వాహకులకు ఇబ్బందికరమైన పరిస్థితులు తలెత్తాయి.

జిల్లాలో ఇటీవల రాయవరంలో బాణసంచా తయారీ కేంద్రంలో సంభవించిన పేలుళ్లలో పదిమంది మృత్యువాతపడ్డారు. అంతకుముందు అయినవిల్లి మండలం విలసలో సంభవించిన బాణసంచా పేలుడు దుర్ఘటనలో భార్యాభర్తలిద్దరూ మృతిచెందారు. దీంతో ప్రభుత్వం బాణసంచా వ్యాపారాలతోపాటు హోల్‌సేల్ వ్యాపార సంస్థలు, రిటైల్ సంస్థలపై వారంరోజులుగా విస్తృతస్థాయిలో తనిఖీలు చేపట్టడంవల్ల వ్యాపారులు ముందుకు రాలేదు.దీంతో చాలాప్రాంతాల్లో దుకాణాలు తక్కువగానే వెలిశాయి. జిల్లావ్యాప్తంగా 420కుపైగా బాణసంచా దుకాణాలు వెలసినట్టు అధికారులు పేర్కొంటున్నారు. అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఏర్పాటుచేసిన బాణసంచా విక్రయాలకు సంబంధించి 38 స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఇక్కడ అగ్నిమాపక అధికారి ఎం.రాజా ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది ప్రత్యేక రక్షణ చర్యలు చేపట్టి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ప్రమాదాలకు తావులేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుని దీపావళి పండుగను కుటుంబసమేతంగా ఆనందంగా జరుపుకోవాలని ఎస్పీ రాహుల్‌మీనా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వెలవెలబోతున్న వ్యాపారాలు

దీపావళి పర్వదినం సందర్భంగా వేసిన బాణసంచా దుకాణాలు వెలవెలబోతున్నాయి. ధరలు అధికంగా పెంచడంవల్ల వినియోగదారులు కొనుగోలు చేసుకునేందుకు ముందుకు రాకపోవడంతోపాటు ఇటీవల జరిగిన ప్రమాదాల నేపథ్యంలో ఈ పరిస్థితి ఏర్పడింది. రెవెన్యూసహా వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు బాణసంచా దుకాణదారులనుంచి భారీగా లైసెన్సు ఫీజులు వసూలు చేయడంతో వ్యాపారులు విలవిల్లాడిపోతున్నారు. ఒక్కో షాపునకు అన్ని లైసెన్సు ఫీజులు కలిపి రూ.20వేల పైనే చెల్లించాల్సి వస్తోందంటూ వారు లబోదిబోమంటున్నారు. అమలాపురంలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో 38బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేశారు. అమలాపురం పట్టణ పరిసర ప్రాంతాలప్రజలకోసం ఈ ఒక్క చోటే వీటిని ఏర్పాటు చేశారు. లైసెన్సు ఫీజులతోపాటు జీఎస్టీ సహా వివిధ రకాల ట్యాక్సులు భారీగా విధించడంతో వ్యాపారులు రేట్లు పెంచేశారు. కొన్నిరోజులకు ముందే దీపావళి వేడుకల హడావుడి కనిపించేది. ఈసారి ఆ పరిస్థితిలేదు. దీపావళి దుకాణాలవద్ద కాకర కొవ్వొత్తులు, తాళ్లు, అగ్గిపెట్టెలు, చిచ్చుబుడ్లు, మతాబులు, సీమ టపాకాయలు, వాలాలు, షాట్స్ వంటి వివిధ రకాల బాణసంచా ధరలు గతం కంటే భారీగా పెరిగిపోయాయి. వేలకు వేలు ఖర్చు చేసి కొనుగోలు చేసినా కొద్దిపాటి సామాగ్రి కూడా వచ్చే పరిస్థితి లేదంటూ కొనుగోలుదారులు ఆవేదన చెందుతున్నారు. పెరుగుతున్న ధరలతోపాటు వరుస ప్రమాదాలతో ఈసారి దీపావళి కళ తప్పింది. జిల్లాలోని రావులపాలెం, మండపేట, ముమ్మిడివరం, రామచంద్రపురం, రాజోలు, కొత్తపేట, మలికిపురం, తాటిపాక సెంటర్లలో ఏర్పాటు చేసిన దుకాణాలు ఏర్పాటయ్యాయి. ధరల పెంపుతో వినియోగదారులనుంచి కొనుగోలు అంతంతమాత్రంగానే ఉందని వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఆదివారం చెదురుమదురు వర్షాలతో వ్యాపారాలు ముందుకు సాగలేదని వారంతా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అమలాపురం బాలయోగి స్టేడియంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలను జిల్లా అగ్నిమాపక అధికారి ఎన్.పార్థసారథి, అమలాపురం అగ్నిమాపక అధికారి ఎం.రాజాతోపాటు పట్టణ, రూరల్ సీఐలు పి.వీరబాబు, ప్రశాంత్‌కుమార్ పరిశీలించి దుకాణ యజమానులకు పలు సూచనలు చేశారు.

అమావాస్య చీకట్లు... దీపాల వెలుగులు

రాజమహేంద్రవరం కల్చరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): చీకటి వెలుగుల రంగేళి.. మన జీవితమే ఒక దీపావళి అన్నారు మనసుకవి ఆత్రేయ.. అసలు దీపా వళి ఎందుకు చేస్తారు..ఏమిటా విశిష్టత అంటే.. అమా వాస్య చీకట్లలో దీపాల వెలుగులు విరజిమ్మే పండుగ దీపావళి. ఆశ్వయుజ బహుళ చతుర్దశి రోజున లోక కంటకుడైన నరకాసురుడిని శ్రీకృష్ణ సమేతసత్యభామ సంహరించి భూభారాన్ని తగ్గించిందని..ఆ విజయానికి ప్రతీకగా మరునాడు అమావాస్య రోజున చీకట్లను తరిమికొట్టి దీపాల కాంతులతో శ్రీకృష్ణ సత్యభామలను ప్రజలు స్వాగతించారు. ఆనాటి నుంచి అశ్వయుజ మాస ఆమావాస్య నాడు దీపావళి పండుగను జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. అరణ్యవాసాన్ని పూర్తి చేసుకుని శ్రీరామ చంద్రుడు అ యోధ్య ప్రవేశించిన రోజు కూడా ప్రజలంతా దీపపు దివ్వెల వెలుగులతో స్వాగతం పలకడంతో ఆ నాటి నుంచి దీపావళి పండుగ ప్రసిద్ధి చెందిందని ప్రతీతి.



ముస్తాబైన..ముంగిళ్లు



ఆనంద.. దివాళీ!

లక్ష్మీదేవి.. రావాలని!



రాజమహేంద్రవరంసిటీ, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ అంటే అందరికీ ప్రత్యేకమే.. మార్వాడీలు, జైన్‌లకు మరీనూ.. ఉమ్మడి తూర్పుగోదా వరి జిల్లాలో వేలాదిగా మార్వాడీ, జైన్‌లు ఉన్నారు. దీపావళికి ముందు వచ్చే ధనత్రయోదశి నాడు మార్వాడీలు తమతమ ఇళ్లలో వెండి, బంగారు వస్తువులు, భారీ నగదుతో లక్ష్మీదేవికి పూజలు చేస్తారు. అనంతరం వ్యాపార సంస్థల పద్దుల పుస్తకాలను మార్చుకుంటారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మార్చి నుంచి మార్చికి ఆర్థిక సంవత్సర లెక్కలు చూసుకుని పద్దు పుస్తకాలు కొత్తవి ప్రారంభిస్తారు. మార్వాడీలు, జైన్‌లు మాత్రం దీపావళికి వారి సొంత పద్దు పుస్తకాలను మార్చుకుంటారు. దీపావళి రోజున పూజ చేసి దుకాణాలు మూసివేస్తారు. మరుసటి రోజు దుకాణం తెరుచుకుని భోణీ చేయించుకుని నూతన పద్దు పుస్తకాలు ప్రారంభిస్తారు. కుటుంబ సమేతంగా దీపావళికి లక్ష్మి దేవి పూజ చేస్తా రు.రామ్‌దేవ్ మందిరానికి వెళ్లి వచ్చి పెద్దల ఆశీర్వాదం తీసుకుని పండుగ చేసుకుంటారు.

కాకినాడ, అక్టోబర్ 19, (ఆంధ్రజ్యోతి) : చీకటిని పారద్రోలి.. వెలుగును స్వాగతించే పండుగ దీపావళి. ఇంటిల్లిపాదీ ఎంతో సందడిగా ఆనందంతో చేసుకొనే ఈ పండుగను మరింత కాంతిమంతంగా జరుపుకునేందుకు ఉమ్మడి జిల్లా వాసులు సిద్ధమయ్యారు. కాసులను కురిపించే లక్ష్మీదేవిని స్వాగతిస్తూ పూజలు చేసేందుకు ముస్తాబయ్యారు. మార్కెట్లో అన్ని దుకాణాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతున్నాయి. పలు రకాల వస్తువులపై జీఎస్టీ తగ్గడంతో పండగల వేళ మార్కెట్లో సందడి వాతావరణం నెలకొంది. ముఖ్యంగా నిత్యావసరవస్తువులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు, బైక్‌లు, కార్ల ధరలు తగ్గుముఖం పట్టడంతో కొనుగోలుకు పలువురు ఆసక్తికనబరుస్తున్నారు. సాధారణంగా దీపావళి అనగానే బాణసంచా కాల్చివేతకు పిల్లలు, పెద్దలు అధిక ప్రాధాన్యమిస్తారు. టపాసులతో ఊరూవాడా మోత ఎక్కిస్తారు. జాతి కులమత బేధాలు లేకుండా సకుటుంబ సపరివారంగా ఒక చోట చేరి ఆనందోత్సాహాలతో జరుపుకునే ఏకైక పండుగ దివ్య దీపావళి. దీపావళి రోజున సాయంత్రం గోగు కర్రలతో దివిటీలను వెలిగించి బాణసంచా కాలుస్తారు.. మార్వాడీలు, బెంగాలీలు, రాజస్థానీలు, మహాలక్ష్మి పూజ చేసి రాత్రంతా జాగారం ఉంటారు.ఆ రోజున ఏ ఇంట దీపాలు నిండుగా వెలుగుతాయో అక్కడ లక్ష్మీ కటాక్షం సిద్ధిస్తుందని ఋగ్వేదం చెబుతోంది. మతాబులు,చిచ్చుబుడ్లు, కాకర పువ్వొత్తులు, టపాసులు తదితర బాణసంచా కాలిస్తే వాటి నుండి వచ్చే పొగతో,క్రిమి కీటకాదులు దరిచేరవని శాస్త్రీయంగా చెబుతారు.కొంత మంది దీపావళి రోజున పితృకర్మలను ఆచరించి పితృదేవతలను స్వాగతించి ఇంటి ముంగిళ్లలో దివిటీలను వెలిగించి అ కాంతుల్లో పితృదేవతలను స్మరించుకుని వారిపేరు చెప్పి బంధుమిత్రులకు భోజనాలు వడ్డించడం మన తెలుగువారి ఆచారం. ఈ దీపావళి మనందరి జీవితాల్లో నవ్య కాంతులు వెదజల్లాలని..మనం చేసే ప్రతీ కార్యంలో విజయలక్ష్మి వరించాలని ఆకాంక్ష.

జీఎస్టీ తుస్!

అక్కడ తగ్గించినా..ఇక్కడ మామూలే

రాజమహేంద్రవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దీపావళి కానుకగా ప్రకటించిన జీఎస్టీ తగ్గింపు(సూపర్‌జీఎస్టీ) సుమారు 350కి పైగా వస్తువుల ధరలు తగ్గింపు రూపంలో జేబుకు కాస్త ఆదా చేసినా..దీపావళికి అత్యంత ప్రధానమైన టపాసుల్లో మాత్రం తుస్సుమంది. దీపావళి బాణసంచాపై జీఎస్టీ తగ్గింపు వర్తింప జేయకపోవడంతో ధరల్లో తగ్గుదల కనిపించలేదు. గతేడాది కంటే కాస్త పెరిగిన ధరలతోనే సామాన్యులు కొనుగోళ్లు జరిపారు.గతేడాది దీపావళి మందు గుండుపై జీఎస్టీ 12 శాతం నుంచి 28 శాతం వరకూ ఉండడంతో ధరలు మండిపోయాయి. ఇప్పుడు కూడా ఆ పన్నుల రూపేణా సాంత్వన లేక మంట తప్పలేదు.అయితే హోల్‌సేల్‌గా తాము కొనుగోలు చేసినపుడు జీఎస్టీ, సీఎస్టీ చెల్లించి సరుకు తెచ్చుకున్నా దుకాణాల వద్దకు చేరేసరికి మళ్లీ రూ.3 వేల వరకూ జీఎస్టీ అంటూ వాణిజ్య పన్నుల అధికారులు తీసుకుని రశీదు చేతిలో పెట్టారని వ్యాపారులు వాపోతున్నారు. మొత్తానికి అన్నీ కలిపి బాణసంచా ధరలు బాంబుల కంటే గట్టిగా పేలడంతో జేబు కకావికలమైంది. ప్యాకింగ్‌పై ఎంఆర్పీలు విక్రయ ధర కంటే 100 నుంచి 500 శాతం అదనంగా ఉండడంతో జీఎస్టీ ఏ ధరపై రిటైలర్‌కి విధిస్తున్నారో అర్థంకాని పరిస్థితి ఉంది.

సుఖసంతోషాలతో దీపావళి జరుపుకోండి

- ఎంపీ హరీష్‌బాలయోగి



అమలాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రజలంతా సుఖసంతోషాలతో జాగ్రత్తగా దీపావళి పండుగను కుటుంబసభ్యులతో కలిసి ఆనందంగా జరుపుకోవాలని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి ఆకాంక్షించారు. అందరికీ దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. చెడుపై విజయం సాధించి ప్రజలకు చీకటిని పారదోలి వెలుగును ప్రసాదించిన ఈపండుగ అందరి జీవితాల్లో వెలుగులు ప్రసాదించాలని ఆకాంక్షించారు. బాణసంచా కాల్చే సందర్భంలో జాగ్రత్తలు తీసుకుని పిల్లాపాపలతో ఆనందంగా జరుపుకోవాలని హరీష్ కోరారు.

దీపావళి అందరి జీవితాల్లో వెలుగులు నింపాలి

- మంత్రి సుభాష్



రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగ రాష్ట్ర ప్రజలందరి జీవితాల్లో వెలుగులు నింపాలని మంత్రి సుభాష్ అన్నారు. ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలని, వెలుగుల పండుగ తెలుగు వారి జీవితాల్లో వేల కాంతులు నింపాలని ఆయన ఆకాంక్షించారు.

ఆనందంగా పండుగ జరుపుకోవాలి

- శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): చీకటిపై వెలుగు.. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీకగా దీపావళిని జరుపుకుంటామని, ప్రతిఇంటా ఆనందకరమైన, ఆహ్లాదకరమైన ఈ పండుగను ప్రజలు జరుపుకోవాలని, దివ్యకాంతులు అందరికీ శాంతి, శ్రేయస్సు, ఆనందాన్ని అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు సోమవారం జరుపుకునే దీపావళి పండుగ శుభకాంక్షలు తెలిపారు. ప్రతిఇంటా ఆనంద దీపాలు వెలగాలని ఈపండుగ జిల్లా ప్రజల జీవితాల్లో ఉజ్వలమైన కాంతులు నింపాలని అభిలాషించారు. సోదరభావం, మతసామరస్యంతో నిండిన సమాజాన్ని నిర్మించడానికి ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందన్నారు. ప్రస్తుతం ఉన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని పండుగ రోజున ప్రతిఒక్కరూ టపాసులు కాల్చేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని, పర్యావరణహితంగా ఈ పండుగను జరుపుకోవాలని కోరుతూ జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలను కలెక్టర్ తెలిపారు.

ప్రమాదాలకు తావు లేకుండా నిర్వహించుకోవాలి

- పండుగ శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ రాహుల్‌మీనా

అమలాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ప్రమాదాలకు తావు లేకుండా ప్రశాంతమైన వాతావరణం మధ్య కుటుంబసభ్యులందరూ ఆనందభరితంగా సోమవారం జరిగే దీపావళి పండుగను నిర్వహించాలని జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. కోనసీమ జిల్లా ప్రజలకు, పోలీసు అధికారులకు, సిబ్బందికి, వారి కుటుంబసభ్యులకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈ పండుగ ప్రతిఒక్కరి జీవితాల్లో నూతన ఆనందాలు, సంతోషాలు, కొత్త కాంతులను తీసుకురావాలన్నారు. దీపావళి పండుగ రోజున ప్రతిఒక్కరూ సురక్షితంగా టపాసులు, ఇతర సామాగ్రిని జాగ్రత్తగా కాల్చుకోవాలని సూచించారు. చిన్నపిల్లలతో టపాసుల కాల్చే సమయంలో జాగ్రత్తలు వహిస్తూ తల్లిదండ్రులు లేదా పెద్దవారి పర్యవేక్షణలోఉండేలా చూడాలని, అధిక శబ్ధం కలిగిన బాణసంచా కాల్చే సమయంలో తోటివారికి ఇబ్బంది కలగకుండా జరుపుకోవాలనిసూచించారు. అగ్నిప్రమాదాలకు తావు లేకుండా ముందు జాగ్రత్తలు తీసుకుని ప్రశాంత పరిస్థితుల నడుమ పర్యావరణ హితంగా జరుపుకోవాలని కోరారు.

దీపావళి సెలవుతో స్పందన రద్దు: కలెక్టర్

అమలాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సోమవారం దీపావళి పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమం రద్దు చేసినట్లు జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ వెల్లడించారు. దీపావళి పండుగ సెలవు దినం కావడం వల్ల ఈ కార్యక్రమం రద్దయినట్లు తెలిపారు. జిల్లావ్యాప్తంగా ఉన్న అర్జీదారులు ఈ విషయాన్ని గమనించి జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని ఒక ప్రకటనలో కోరారు.

పనుల పునరుద్ధరణ జరిగేనా?



కొబ్బరి చెట్టుకు చుట్టూ గాడి తవ్వుతున్న ఉపాధి హామీ కూలీలు(ఫైల్)

- కొబ్బరి చెట్ల ట్రెంచింగ్ పనులు కొనసాగించాలి
- రహదారుల వెంబడి తుప్పలు తొలగించే పనులు చేపట్టాలి
- కేంద్ర బృందానికి ఎమ్మెల్యే ఆనందరావు, రైతుల సూచనలు

ఉప్పలగుప్తం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల పరిశీలన నిమిత్తం ఇద్దరు సభ్యుల కేంద్రం బృందం ఈనెల 13 నుంచి 17 వరకు అమలాపురం నియోజకవర్గంలో పర్యటించింది. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వశాఖ జేడీ ఉమేష్‌కుమార్, ఎస్‌వో మయూర్వ ర్మ ఈ బృందంలో ఉన్నారు. ఎన్ఆర్ఈజీఎస్‌ద్వారా అములులో ఉన్న రోడ్లు, పశువుల షెడ్లు, చెత్త సంపద కేంద్రాలు, కేంద్ర నిధులతో డ్వాక్రా మహిళలు నిర్వహిస్తున్న పలు పథకాలను వారు పరిశీలించారు. లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడారు. లబ్ధిదారులనుంచి సలహాలు స్వీకరించారు. ఈ సమావేశాల్లో రుణ మొత్తాలను పెంచాల్సిన ఆవశ్యకతను లబ్ధిదారులు వివరించారు. ఇక ఉపాధి హామీ పథకం విషయంలో పలు అంశాలను కార్డుదారులు కేంద్ర బృందం దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం పంటకాల్వల వెంబడి తుప్పలు తొలగించడం, కాల్వల బాగుజేత మినహా ఇతర పనులను జాబితానుంచి తొలగించిన వైనాన్ని ప్రజలు కేంద్ర బృందానికి స్పష్టం చేశారు. ఆఖరిగా ఈ బృందం ఈ నెల 17న స్థానిక ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావుతో సమావేశమైంది. ఈ సందర్భంగా ఆయన ఉపాధి హామీ పథకం కోనసీమలో వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల చేకూరిన ప్రయోజనాలను బృందానికి వివరించారు. జిల్లాలో వ్యవసాయమంటే కేవలం వరిసాగు మాత్రమే కాదని, కొబ్బరి పంట కూడా ఒక భాగమన్నారు. ఎరువు వేయాలంటే చెట్ల చుట్టూ గాడి(ట్రెంచింగ్) తవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకంలో ట్రెంచింగ్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం అనంతరం తొలగించిందన్నారు. గతంలో రహదారుల వెంబడి తుప్పలు తొలగింపు, పంటకాల్వలు, మురుగు కాల్వల్లో గుర్రపుడెక్క తొలగింపు ఉపాధి పనుల్లో ఉండగా ఇప్పుడవి తొలగించారని తెలిపారు. ట్రెంచింగ్, గుర్రపుడెక్క తొలగింపు లేనందున రైతులకు తీవ్ర నష్టం వాటిల్లినట్టు వివరించారు. తొలగించిన పనులను పునరుద్ధరించేలా ప్రభుత్వానికి నివేదిక అందించాలని కోరారు. గ్రామాల్లో ఇవే సమస్యలను ప్రజలు ప్రస్తావించినట్టు బృందం ఎమ్మెల్యేకు తెలిపింది. ప్రజాప్రతినిధుల, లబ్ధిదారుల సూచనలను, సలహాలను గ్రామీణమంత్రిత్వశాఖకు నివేదిస్తామని బృందం తెలిపింది.



జనావాసాల మధ్య విషసర్పాలు కనిపిస్తే బెంబేలెత్తిపోతారు... ఎవరికి చెప్పుకోవాలో తెలియక సతమతమవుతుంటారు... అందుబాటులో స్నేక్ క్యాచర్స్ నెంబర్లు ఉంటే సమాచారం ఇస్తారు.... కాస్త ప్రమాదకరం అని భావిస్తే ఏదోలా వాటిని హతమార్చేందుకు యత్నిస్తారు. కొందరైతే ప్రమాదకర విషసర్పాల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్నారు. అలాగే ఇటీవలి కాలంలో జిల్లాలో పాముకాటు బాధితులు కూడా పెరిగారు. అటువంటి ఇబ్బందులను తొలగించేందుకు కాకినాడ జిల్లా అటవీ శాఖ అధికారులు ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్నారు.





- విష సర్పాలపై ప్రజలకు అవగాహన కల్పించే ఆలోచన
- స్నేక్ రెస్క్యూవర్స్‌గా మారే వారికి శిక్షణ
- ప్రత్యేక యాప్ రూపకల్పనకు కాకినాడ జిల్లా అటవీ శాఖ ప్రణాళిక

స్నేక్ లవర్స్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో అంతంతమాత్రంగా ఉన్న స్నేక్ రెస్క్యూవర్స్ (స్నేక్ లవర్స్) సంఖ్యను పెంచేందుకు ప్రయత్నం చేస్తున్నారు. అరుదైన జాతి సర్పాలు అంతరించిపోకుండా వాటిని సంరక్షించి, జనావాసాలకు దూరంగా అటవీ ప్రాంతాల్లో విడిచిపెట్టేలా, అటు సర్పాలకు, ఇటు ప్రజలకు ఎటువంటి ప్రమాదం లేకుండా ఉండేలా.. ఔత్సాహిక స్నేక్ లవర్స్‌కు శిక్షణ ఇచ్చేలా ఓ సరికొత్త కార్యక్రమాన్ని రూపొందిస్తున్నారు. సర్పాలపై ప్రజలకు అవగాహన కలిగించే రీతిలో త్వరలో ఓ యాప్‌ను అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు.

జిల్లా అటవీ శాఖాధికారిగా ఇటీవల నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎన్.రామచంద్రరావును కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలెం గ్రామానికి చెందిన స్నేక్ రెస్క్యూవర్ నరాల శివ (స్నేక్ శివ) ఇటీవల మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విషసర్పాల విషయమై ఇద్దరూ చర్చించారు. ఈ సందర్భంగా అటవీ శాఖాధికారి రామచంద్రరావు మాట్లాడుతూ విష సర్పాల విషయంలో ప్రజలను అప్రమత్తం చేసేలా, వాటిపై ప్రజలకు అవగాహన కలిగించేలా త్వరలో ఓ యాప్‌ను అందుబాటులోకి తేవాలని భావిస్తున్నట్టు తెలిపారు. రాష్ట్రంలో ఈ తరహా యాప్



ఎక్కడా అందుబాటులో లేదని, తొలిసారిగా కాకినాడ జిల్లా నుంచే ప్రయోగాత్మకంగా యాప్ రూపకల్పనకు ముందడుగు వేస్తున్నట్టుగా వెల్లడించారు.

ఈ యాప్‌లో సర్ప జాతుల పేర్లు, విషపూరితమైనవి ఏవి? పాముకాటు నివారణకు ఏయే చర్యలు తీసుకోవాలి? స్నేక్ యాంటీ వీనమ్ దొరికే ప్రాంతాలు, ఏయే రకమైన సర్పాలతో ప్రమాదం? పాముకాటు విరుగుడు మందుల పేర్లు... ఇలా అన్ని వివరాలను వాటిలో పొందుపరుస్తామని తెలిపారు.



అటవీ శాఖాధికారి రామచంద్రరావుని మర్యాదపూర్వకంగా కలిసిన శివ

ఔత్సాహికులకు ప్రత్యేక శిక్షణ

డీఎఫ్‌వో రామచంద్రరావు

పాములను సంరక్షించాలనే ఉత్సాహం, వాటి బారి నుంచి ప్రజలను రక్షించాలనే ఆసక్తి ఉన్న వారు తమను సంప్రదిస్తే వారికి స్నేక్ రెస్క్యూవర్ నరాల శివలాంటి వారితో ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తాము. స్నేక్ రెస్క్యూవర్స్‌గా సమాజానికి పరిచయం చేస్తాము. త్వరలో తాము రూపొందించబోయే యాప్‌లో స్నేక్ రెస్క్యూవర్ (పాముల ప్రేమికులు) వలంటీర్ల నంబర్లను కూడా అందుబాటులో ఉంచుతాము. వారిని సంప్రదిస్తే రెస్క్యూ సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుంటారు. స్నేక్ లవర్స్ ఎవరైనా స్వచ్ఛందంగా వలంటీర్లుగా పనిచేయాలనుకుంటే 9154014499, 7702089479 నెంబర్లను సంప్రదించాలి.

వెలుగులు విరజిమ్మే దీపావళి



నిర్లక్ష్యం చేస్తే చిమ్మ చీకటిని ఆహ్వానించినట్టే!

ముందు జాగ్రత్తలు పాటించాలి

కాకినాడ సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు





కాకినాడ క్రైం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): నరకాసుర వధకు ప్రతీకగా జరుపుకునే వెలుగులు విరజిమ్మే దీపావళి పండుగ వచ్చేసింది. మిరుమిట్లు గొలిపే వెన్నెల కాంతులు వికసించనున్నాయి. అయితే ఏమాత్రం నిర్లక్ష్యం, అశ్రద్ధ చేసినా ఆయా కుటుంబాలను చిమ్మ చీకట్లు కమ్ముకునే అవకాశాలు లేకపోలేదు. ఇందుకు గత చేదు జ్ఞాపకాలే నిదర్శనం. ప్రజలు అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు పాటిస్తూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని అగ్నిమాపక శాఖ కాకినాడ సాలిపేట ఏడీఎఫ్‌వో వి.సుబ్బారావు సూచించారు. ఆయన కొన్ని ముందస్తు జాగ్రత్తలు తెలియజేశారు.



- టపాసులు కాల్చే సమయంలో నైలాన్, సింథటిక్ వంటివి కాకుండా కాటన్, బిగుతుగా ఉండే దుస్తులు వేసుకోవాలి.
- బాణసంచా కాల్చే విషయంలో పిల్లలను ఒంటరిగా వదలకూడదు. ఉత్సాహంలో వారు చేసే తప్పులు ఒక్కోసారి ప్రమాదాలకు దారితీస్తాయి. ఎవరో ఒకరు పెద్దవారు కచ్చితంగా వారి పక్కనే ఉంటూ వారిని గమనిస్తూ ఉండాలి.
- ఇంటి వెలుపల మాత్రమే టపాకాయలను కాల్చాలి. సగం కాలిన వాటిని తిరిగి వెలిగించేందుకు ప్రయత్నించరాదు.
- మండే వస్తువులు, ఎండిన ఆకులు, గడ్డి, దుస్తులు వంటివి లేకుండా జాగ్రత్త పడాలి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా ఒక బకెట్ నిండా నీరు, ఇసుక సిద్ధం చేసుకోవాలి. ఒకవేళ మంటలు ఎగసిపడితే పొడి ఇసుక లేదా నీటితో ఆర్పాలి.
- ముఖ్యంగా గుడిసెలు, గడ్డివాములు, పెట్రోలు బంకులు వంటి వాటికి దూరంగా బాణసంచా కాల్చాలి.
- ప్రమాదవశాత్తు అగ్నికీలలు దుస్తులపై పడితే



నేలపై పడి దొర్లాలి.
- బాణసంచా విక్రేతలు నిబంధనలకు వ్యతిరేకంగా షాపులను నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని అగ్నిమాపక, పోలీసు శాఖ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. ఇటీవల డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సావరం గ్రామంలోని బాణసంచా తయారీ కేంద్రంలో ఈ నెల 8వ తేదీన జరిగిన భారీ విస్ఫోటనంలో 10 మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బాణసంచా తయారీ కేంద్రాలు, విక్రయ దుకాణాలపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు.



కాకినాడ జిల్లాలో ఫైర్ స్టేషన్లు వాటి ఫోన్ నెంబర్లు



ఫైర్ స్టేషన్	ల్యాండ్‌లైన్	మొబైల్
కాకినాడ (సాలిపేట)	08842374572	9963726854
కాకినాడ (జగన్నాథపురం)	08842374592	9963726902
పెద్దాపురం	08852241299	9963726982
ప్రత్తిపాడు	08868246709	9963727769
జగ్గంపేట	08852233388	9603727995
పిఠాపురం	08869251501	9963727859
తుని	08854253601	9963727194

జిల్లాలో ఎక్కడైనా ఏదైనా అగ్నిప్రమాదం సంభవిస్తే వెంటనే పై నెంబర్లకు ఫోను చేయాలని ఏడీఎఫ్‌వో సూచించారు.

జీఎస్టీ 2.0పై విస్తృత అవగాహన

- కలెక్టర్ కీర్తి చేకూరి, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి
- ముగిసిన ది గ్రేట్ రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవం



చిచ్చుబుడ్లు వెలగిస్తున్న కలెక్టర్ చేకూరి, జీసీ మేఘాస్వరూప్

రాజమహేంద్రవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ 2.0పై జిల్లా వ్యాప్తంగా విస్తృత ప్రచారం నిర్వహించామని, ఇలాంటి పథకాల ద్వారా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం ప్రజా సంక్షేమ కార్యక్రమాలకే వ్యయం చేస్తారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్ పేరుతో ఈనెల 14 నుంచి నిర్వహించిన ది గ్రేట్ రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా స్థానిక ఆనంద్ రీజెన్సీ పందిరి హాల్‌లో జరిగిన కార్యక్రమానికి కలెక్టర్ కీర్తి చేకూరితోపాటు జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్, రాజమహేంద్రవరం రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ముఖ్యఅతిథులుగా విచ్చేసి జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. టపాసులు కాల్చి, చిచ్చుబుడ్లు వెలిగించి దీపావళి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో కలెక్టర్ కీర్తి మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపుతో ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, వాహనాలు, మందులు, మిల్క్ ప్రొడక్ట్ తదితర విభాగాల్లో ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. జ్యూట్ బ్యాగ్‌లు, చేనేత వస్త్రాలు, వంట ఉత్పత్తులు ప్రదర్శించి, విక్రయించే అవకాశం కల్పించామన్నారు. కడియం ప్రాంతంలోని పూల వ్యర్థాలతో అగరబత్తులు తయారు చేస్తున్న మహిళా సంఘాలు ఆదర్శంగా నిలుస్తున్నాయని, ఈ అగర్‌బత్తీలను దేవాలయాల ద్వారా మార్కెట్ చేయడానికి అవకాశం కల్పించామన్నారు. ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల పన్నుల పారదర్శకతతో పాటు ప్రజలకు లబ్ధి చేకూరుతుందన్నారు. బిల్లులు తీసుకోవడం ద్వారా పన్నుల్లో తగ్గింపు వివరాలు ప్రజలకు స్పష్టమవుతాయని చెప్పారు. ప్రతీ వినియోగదారుడు బాధ్యతతో వ్యవహరించాలని కోరారు. జనరిక్ మందుల వినియోగంపై అవగాహన పెంపు, దేశీయ ఉత్పత్తులను ప్రోత్సహించడం, మేక్ ఇన్ ఇండియా-మేకింగ్ ఆంధ్రప్రదేశ్ దిశగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా జాయింట్ కలెక్టర్, జీఎస్టీ నోడల్ అధికారి వై.మేఘాస్వరూప్ మాట్లాడుతూ టీవీలు, ఏసీలు, మిక్సీలు, వాషింగ్ మిషన్ల వంటి ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపుతో రూ.5 వేల నుంచి రూ.15 వేల వరకూ ప్రజలకు లబ్ధి చేకూరిందన్నారు. వాణిజ్య పన్నుల జాయింట్ కమిషనర్ ఎం.సుధాకరరావు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 4,300 అవగాహన కార్యక్రమాలు చేపట్టి జీఎస్టీ చాంపియన్లు ప్రతీ ఇంటికి వెళ్లి ధరల్లో వ్యత్యాసాలపై వివరాలు అందించారన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కె.భాస్కరరెడ్డి, వాణిజ్య పన్నుల శాఖ అసిస్టెంట్ కమిషనర్ టీవీ నాగేశ్వర రావు, జీఎస్టీ అధికారి హంస్సేన్ షరీఫ్, డిప్యూటీ ఈఏసీ కె.సురేష్‌కుమార్, డీఆర్‌డీఏ పీడీ ఎన్‌వీవీఎస్ మూర్తి, యాదవ్ కార్పొరేషన్ డైరెక్టర్ బత్తుల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

లక్కీడిప్ విజేతలు..

ది గ్రేట్ రాజమహేంద్రవరం షాపింగ్ ఉత్సవ్ సందర్భంగా నిర్వహించిన లక్కీ డిప్‌లో విజేతలకు కలెక్టర్ కీర్తి, ఎమ్మెల్యే గోరంట్ల తదితరులు బహుమతులను అందజేశారు. మొదటి బహుమతి కొవ్వూరుకు చెందిన వల్లీ, రాజమహేంద్రవరానికి చెందిన వీటీ శ్రీనివాస్ గెలుపొందగా రెండో బహుమతి కె.చిన్ని, డి.దుర్గాభవాని, పి.లక్ష్మీదివ్య, మూడో బహుమతి ఎన్.జోగేశ్వరరావు, యు.రామలక్ష్మి, ఎం.అనంతరెడ్డి గెలుపొందారు.



బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల, కలెక్టర్, జేసీ

ఫెన్సింగ్‌ను అమ్మాయిలూ నేర్చుకోవాలి

- కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాసు
- ముగిసిన 12వ ఏపీ సబ్ జూనియర్ అండర్-14 బాలుర, బాలికల ఫెన్సింగ్ పోటీలు



విజేతలను అభినందిస్తున్న కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాసు

సామర్లకోట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు కరాటే, టైక్వాండో, వంటి క్రీడలతో బాటు ఫెన్సింగ్ క్రీడను నేర్చుకోవాలని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాసు అన్నారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని లక్ష్య ఇంటర్ నేషనల్ స్కూల్ ఆవరణలో రెండు రోజులపాటు నిర్వహించిన 12వ రాష్ట్ర సబ్ జూనియర్ అండర్-14 బాలుర, బాలికల ఫెన్సింగ్ క్రీడా పోటీలు ఆదివారం ముగిసాయి. ప్రారంభ, ముగింపు కార్యక్రమాలకు ఎంపీ ఉదయ్ శ్రీనివాసుతోపాటు పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి(బాబు), జనసేన జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్, ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జీఎస్వీ కృష్ణమోహన్, వి.నాగేశ్వరరావు, ఆదిత్య విద్యాసంస్థల ఛైర్మన్ నల్లమిల్లి శేషారెడ్డి, స్కూల్ కార్యదర్శి దీపక్‌రెడ్డి, డైరెక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ఎంపీ ఉదయ్ శ్రీనివాసు ఫెన్సింగ్ క్రీడ ప్రాధాన్యతను వివరించారు. సుగుణారెడ్డి మాట్లాడుతూ అత్యంత పారదర్శకతతో ఈ క్రీడాపోటీలను నిర్వహించామన్నారు. అండర్-14 విభాగంలో 13 జిల్లాల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. వ్యక్తిగత, జట్టు విభాగాల్లో ఫాయిల్, సేబర్, ఈపీ కేటగిరిలలో పోటీలు నిర్వహించామన్నారు. ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ప్రథమస్థానం కర్నూలు జిల్లా, ద్వితీయ స్థానాన్ని పశ్చిమగోదావరి జిల్లా, తృతీయస్థానాన్ని తూర్పు గోదావరి జిల్లా కైవశం చేసుకున్నాయన్నారు. కాగా ఈ పోటీల్లో లక్ష్య స్కూల్లో చదువుతున్న నల్లమిల్లి శేషరిషిత్‌రెడ్డి, కె.చైత్రిక్ సహర్షరెడ్డి, ఎం.మనీష్, ఎన్.అష్విర్థిక శేఖర్, ఎస్.భావ్యసహజరెడ్డి, టి.సితారా, బి.లక్ష్మీకృతిక, ఎల్.బృహతీఖడ్గ, ఎం.సౌమ్య, ఎ.పర్ణిక, బి.జానకి, జె.పరిణీతి, బంగారు, రజత పతకాలు కైవసం చేసుకున్నారన్నారు. సెబర్ విభాగంలో రిషీత్‌రెడ్డి బంగారు పతకం సాధించి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు సుగుణారెడ్డి తెలిపారు. పతకాలు సాధించిన క్రీడాకారులను ప్రిన్సిపాల్ వందనబోస్ అభినందించారు.

దివ్యాంగులకు ఇంటింటి సర్వే నుంచి మినహాయింపు

- ప్రకృతి విపత్తుల సమయంలో విధిగా హాజరు కావాలి
- గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగులకు విధులు ఖరారు



ఈదరపల్లిలో సచివాలయ ఉద్యోగులు(ఫైల్)

అమలాపురం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సచివాలయ ఉద్యోగులకు విధులను ఖరారు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. పురపాలక సంఘాల్లోని వార్డు సచివాలయాలు, పంచాయతీల్లో గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పష్టమైన జాబ్ చార్టు లేకపోవడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా తమకు ఒకే సమయంలో అనేక పనులు కేటాయిస్తున్నారంటూ ఉద్యోగులు ఇటీవల ఆందోళన బాట చేపట్టారు. దాంతో ప్రభుత్వం సచివాలయ సిబ్బంది జాబ్‌చార్టును ఖరారు చేసింది. ఈ మేరకు డిపార్టుమెంట్ ఆఫ్ జీఎస్‌డబ్ల్యూఎస్ శాఖ జీవో నెం.11 జారీ చేసింది. జాబ్‌చార్టు అమలు బాధ్యతను సంబంధిత అధికారులకు అప్పగించింది.

ఇంటి ముంగిటకే పథకాలు..

పౌరుల ఇంటి ముంగిటకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, సేవలను చేర్చాల్సిన బాధ్యత సచివాలయ ఉద్యోగులదేనని ఉత్తర్వుల్లో స్పష్టంగా పేర్కొన్నారు. కోనసీమ జిల్లాలో గ్రామ సచివాలయాలు 467 ఉండగా, పురపాలక సంఘాల పరిధిలో 48 వార్డు సచివాలయాలు ఉన్నాయి. మొత్తం 515 సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులకు స్పష్టమైన పనుల వివరాలను ఉత్తర్వుల్లో వివరించారు. సచివాలయాలకు వచ్చే అర్జీలను పరిష్కరించే బాధ్యత ఉద్యోగులదే. ప్రకృతి విపత్తుల సమయంలో సచివాలయ సిబ్బంది విధిగా హాజరు కావాలని స్పష్టం చేసింది. ప్రభుత్వం అప్పగించే ప్రతీ పనిని చేయాల్సి ఉంటుందన్నారు. సచివాలయ సిబ్బంది ఒకేసారి ఎక్కువ పనులు చేయాల్సి వస్తే జిల్లాలోని గ్రామ/వార్డు సచివాలయ జిల్లా అధికారి సంబంధిత శాఖల జిల్లా అధికారులతో చర్చించి కలెక్టర్ అనుమతితో పనుల ప్రాధాన్యతను నిర్ణయిస్తారు.

సమగ్ర సమాచారం ఉండాలి..

సచివాలయ ఉద్యోగులు తమ పరిధిలోని డేటాను సమగ్రంగా సేకరించాలి. పూర్తి సమాచారంతో సిద్ధంగా ఉండాలి. గ్రామ/వార్డు అభివృద్ధి ప్రణాళికల్లో భాగస్వాములు కావాలని జీవోలో పేర్కొన్నారు. దివ్యాంగ సిబ్బందికి ఇంటింటా సర్వే నుంచి మినహాయింపు ఇచ్చారు. గత వైసీపీ ప్రభుత్వంలో 2019లో జీవో నెంబరు 110, జీవో నెంబరు 217లను వేర్వేరుగా విడుదల చేసింది. వాటికి అనుబంధంగా సచివాలయ ఉద్యోగులకు జాబ్‌చార్టులను విడుదల చేస్తూ కూటమి ప్రభుత్వం జీవో నెంబరు 11ను జారీ చేసింది. సచివాలయ ఉద్యోగులు ప్రభుత్వ ప్రాధాన్యతా పనుల్లో విధిగా పాల్గొనాలని స్పష్టం చేసింది.

గోదావరి జిల్లాలు బీజేపీకి అడ్డా

పార్టీ రాష్ట్రాధ్యక్షుడు మాధవ్



లక్ష్మీప్రసన్న దంపతులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

కార్పొరేషన్ (కాకినాడ), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 'గోదావరి జిల్లాలు బీజేపీకి అడ్డా... ఇక్కడ 27 శాతం ఓటింగ్ ఉంది... అనేక గెలుపులు నమోదు చేసిన చరిత్ర ఈ ప్రాంతంలో ఉంది' అని ఆ పార్టీ ఏపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ అన్నారు. కాకినాడలో ఆదివారం జరిగిన బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాలగ్రామ లక్ష్మీప్రసన్న అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ప్రతిపక్షాలు ఊహించని ఫలితాలను బీజేపీ గతంలో నమోదు చేసిందన్నారు. పార్టీలో పదవులు అలంకారం కాదని, ఒక బాధ్యత అన్నారు. ప్రధాన కార్యదర్శి పదవిలో వున్న వారికి పని భారం అధికంగానే ఉంటుందని, అటువంటి బాధ్యతను లక్ష్మీప్రసన్నకు అప్పజెప్పామన్నారు. ఆమె పార్టీకి చేసిన సేవలను గుర్తు చేస్తూ బ్రాహ్మణ సమాజం రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. లక్ష్మీప్రసన్న దంపతులను గజమాలతో సత్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యులు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు,ఎంపీలు దగ్గుబాటి పురందేశ్వరి, పీవీ సత్యనారాయణ, ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధి,మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, బీజేపీ కాకినాడ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, నాయకులు వేటుకూరి సూర్యనారాయణరాజు, నిర్మలాకిషోర్ పాల్గొన్నారు.

బి.దొడ్డవరంలో విదేశీ కొంగలు



మామిడికుదురు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): బి.దొడ్డవరం గ్రామంలోని గోదావరి మధ్యలంకలో విదేశీ కొంగలు సందడి చేశాయి. చూపరులకు కనువిందు చేస్తున్నాయి. గోదావరి మధ్యలో ఆహ్లాదకరమైన వాతావరణం కలిగిన దట్టమైన చెట్లపై నివాసం ఏర్పాటు చేసుకుని నివశిస్తున్నాయి. కొద్దిరోజులుగా మధ్యలంకలో విదేశీ కొంగలు సందడి చేస్తూ పర్యాటకులను విశేషంగా ఆకర్షిస్తున్నాయి. విదేశీ పక్షులను పలువురు కెమెరాల్లో బంధించడానికి ఆసక్తి కనబరుస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి విదేశీ కొంగలు భారతదేశ వాతావరణంలోకి వచ్చి గుడ్లను పెట్టి తిరిగి పిల్లలతో తమ దేశానికి వెళ్తాయని పలువురు తెలిపారు.

కోరింగ రోప్‌వే బ్రిడ్జి పరిశీలన



అధికారులు, నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ హరీష్‌మాధుర్

తాళ్లరేవు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలంలోని పాత కోరింగ రోప్‌వే బ్రిడ్జిని అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్ ఆదివారం పరిశీలించారు. వంతెన మరమ్మతులపై అధికారులు, నాయకుల బృందంతో ఆయన చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ మరమ్మతులకు మొదటి విడతగా రూ.20లక్షలు మంజూరయ్యాయని, పూర్తి కావాలంటే మరో రూ.40 లక్షలు కావాలన్నారు. శాశ్వత వంతెన నిర్మాణానికి రూ.13 కోట్లు అవసరమవుతాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు,టీడీపీ మండల కార్యదర్శి డి.వెంకటరమణ, సొసైటీ అధ్యక్షుడు కొప్పిశెట్టి బాబి, పొన్నమండ రామలక్ష్మి, వెంటపల్లి ఉమామహేశ్వరి, పినపోతు సోమరాజు, చంటి, చంద్రాల ఆదినారాయణ, జవ్వాది తాతాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

కార్తీకంలో భక్తులకు ఇబ్బందులు రాకుండా పటిష్ట చర్యలు

గిరిప్రదక్షిణ రోజున ఉదయం పల్లకీసేవ, మధ్యాహ్నం సత్యరథం

అన్నవరం దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో

అన్నవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధికి కార్తీకమాసం సందర్భంగా రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా పటిష్టమైన చర్యలు చేపట్టినట్టు ఈవో వీర్ల సుబ్బారావు పేర్కొన్నారు. ఆదివారం తన కార్యాలయంలో విలేకర్ల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభమవుతాయన్నారు. ఎక్కడా ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా ఎక్కిడికక్కడ వన్‌వే మాదిరి వాహన రాకపోకలు కొనసాగుతాయన్నారు. రద్దీరోజుల్లో పశ్చిమ రాజగోపురం వద్ద హోల్డింగ్ పాయింట్లను ఏర్పాటు చేసి లోపల వ్రతమండపాలు ఖాళీఅయిన తరువాతనే కంపార్టుమెంట్‌లలో వేచిఉన్న వారిని లోపలకి పంపుతామని దీని వల్ల తోపులాటలకు ఆస్కారం లేకుండా ఉంటుందని ఈవో తెలిపారు. కార్తీకమాసంలో సత్యదేవుడి గిరిప్రదక్షిణ, తెప్పోత్సవం తదితర ముఖ్యమైన కార్యక్రమాలను అనుకున్న సమయానికి ప్రారంభిస్తామన్నారు. కార్తీక పౌర్ణమి రోజున (నవంబరు 5) గిరిప్రదక్షిణ జరగనుందన్నారు. ఉదయం 8.30కి సత్యదేవుడి పల్లకీలో రత్నసత్యగిరిలు చుట్టూ ప్రదక్షిణ ఉంటుందని.. భక్తులతో మధ్యాహ్నం రెండుగంటల నుంచి సత్యరథం ప్రారంభమవుతుందని సుమారు 1.50 లక్షల మంది భక్తులు విచ్చేస్తారని అంచనాతో ఏర్పాట్లు చేస్తున్నామని పేర్కొన్నారు. స్వామివారి తెప్పోత్సవం నవంబరు 2న జరుగుతుందని, ఆ రోజు సాయంత్రం 5.30కి తులసిధాత్రి పూజను నిర్వహించి రాత్రి 7గంటలకు పంపాసరోవరంలో నౌకావిహారం నిర్వహిస్తామన్నారు. వేడుకలకు సంబంధించి విస్తృతప్రచారం గావించినట్టు ఈవో తెలిపారు. సమావేశంలో ఏఈవోలు కృష్ణారావు, అనకాపల్లి ప్రసాద్, భాస్కర్ పాల్గొన్నారు.

సామర్లకోటలో కుంభవృష్టి

- భారీ వర్షంతో పట్టాలపైకి నీరు
- స్తంభించిన రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ
- పలు రైళ్లు ఆలస్యం
- పనుల్లో అధికారులు నిమగ్నం



సామర్లకోటలో భారీ వర్షానికి రైళ్ల పట్టాలపైకి చేరిన నీరు



రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థను పరిశీలిస్తున్న సిబ్బంది

సామర్లకోట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోటలో వర్షం కుంభవృష్టిగా కురిసింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు కురిసిన భారీ వర్షానికి లోతట్టు, మెరక ప్రాంతాలు పూర్తిగా జలమయమయ్యాయి. పలు కాలనీల్లో ఇళ్లల్లోకి నీరు చేరింది. భారీ వర్షానికి ఏడీబీ రోడ్డు మీదుగా వరద నీరు పెద్ద ప్రవాహంలా వీర్రాజునగర్, ఎఫ్‌సీఐ గోదాములు, సత్యనారాయణపురం మీదుగా ఆదివారం తెల్లవారుజాము నుంచి రైలు పట్టాలపైకి చేరింది. రైల్వే స్టేషన్‌లోని ఐదు ట్రాక్‌లపై అడుగు ఎత్తున నీరు నిలిచిపోయింది. దీంతో రైల్వే సిగ్నలింగ్ వ్యవస్థ స్తంభించింది. రైళ్ల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడడంతో ఔటర్ సిగ్నల్ వద్ద రైళ్లను నిలుపుదల చేసి రైల్వే సిబ్బంది సహాయం తో స్టేషన్‌కు తీసుకువచ్చి తిరిగి పంపే ఏర్పాట్లలో అధికారులు నిమగ్నమయ్యారు. దీంతో ఆదివారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు సుమారు 14 గంటల పాటు విజయవాడ, విశాఖ వైపు రైళ్లు 10-20 నిమిషాల ఆలస్యంతో రాకపోకలు సాగించాయి. ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. మరోపక్క రైల్వే ట్రాక్‌పైకి వరద నీరు చేరకుండా నియంత్రించేందుకు రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో అధికారులు సహాయ చర్యలు చేపట్టారు. పెద్దపులి చెరువు, మట్టపల్లివారి చెరువు, సంపంగ తోట చెరువులు పూర్తిగా నీటితో నిండాయి. ఆ నీరు ఎగువ ప్రాంతాల నుంచి చేరడంతో ఎఫ్‌సీఐ తూముల నుంచి డీఎస్‌పి క్వార్టర్స్ తూముల మీదుగా గోదావరి కాలువలోకి మళ్లించేందుకు రైల్వే అధికారులు ఎంతో శ్రమించాల్సి వచ్చింది. ఆదివారం రాత్రికి కూడా రైల్వే స్టేషన్‌లోని ఐదు ట్రాక్‌లపై వరద నీరు పూర్తిస్థాయిలో తొలగిపోలేదు. వర్షాలు తగ్గుముఖం పడితే సోమవారం తెల్లవారుజాము నాటికి నీటిని తొలగించే చర్యలు పూర్తవుతాయని సామర్లకోట రైల్వే స్టేషన్ సూపరింటెండెంట్ ఎం.రమేష్ 'ఆంధ్ర జ్యోతి'కి తెలిపారు. ఇటీవల ఆరేళ్లలో కురిసిన వర్షాలకు ట్రాక్‌పైకి ఇంతలా నీరు చేరిన దాఖలాలు లేవని అధికారులు చెప్తున్నారు. జిల్లాలోనే అత్యధికంగా సామర్లకోట మండలంలో 132.4 మి.మీ. వర్షపాతం నమోదైందని మండల గణాంకఅధికారి ప్రసాద్ చెప్పారు.

'లోవ'కు పోటెత్తిన భక్తులు

రూ.2.61 లక్షల ఆదాయం



ప్రత్యేక అలంకరణలో తలుపులమ్మ

తుని రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం కాకినాడ జిల్లాలోని తలుపులమ్మ లోవ దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం కావడంతో వేకువజాము నుంచే భక్తులు రాక ఆరంభమైంది. వేలాదిగా వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సమీపాన ఉన్న కాటేజీలు, తోటల్లో వంటలు చేసుకుని సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా మొత్తం రూ.2,61,779 ఆదాయం వచ్చినట్టు ఈవో విశ్వనాధరాజు తెలిపారు.



క్యూలో బారులు తీరిన భక్తులు

బంగారు చీరలో... అన్నపూర్ణాదేవి

మండపేట, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో బూరుగుంట చెరువు వద్ద ఉన్న అన్నపూర్ణా దేవి బంగారు చీరలో దర్శనమిచ్చారు. దీపావళి సందర్భంగా 3 రోజుల పాటు అమ్మవారికి బంగారు పూత పూసిన చీరతో అలంకరించడం ఇక్కడ ప్రతిఏటా జరుగుతుందని ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు.



మండపేటలో బంగారు చీరలో దర్శనమిస్తున్న అమ్మవారు

పూలమార్కెట్‌కు దీపావళి శోభ

కడియం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): తూర్పు గోదావరి జిల్లా కడియపులంక అంతర్‌రాష్ట్ర పూలమార్కెట్ దీపావళి శోభను సంతరించుకుంది. పండుగ సందర్భంగా లక్ష్మీదేవి పూజతో పాటు కార్తీకమాసం ఆరంభంతో అయ్యప్పస్వాములు, శివమాలధారులు పూల కొనుగోళ్లతో మార్కెట్ రద్దీగా మారింది.





సందడిగా మారిన కడియపులంక పూలమార్కెట్ దృశ్యాలు

కడియపులంక అంతర్‌రాష్ట్ర పూలమార్కెట్‌లో ధరలు ఇలా....

చామంతి(కిలో) రూ.150-250
తెలుపు చామంతి(కిలో) రూ.250
నీలం చామంతి(కిలో) రూ.150- 200
వైట్‌స్నోబాల్ చామంతి(కిలో) రూ.400
పసుపు బంతి(కిలో) రూ.100
ఎరుపుబంతి(కిలో) రూ.100
కలకత్తాబంతి(కిలో) రూ.100
లిల్లీ(కిలో) రూ.150
గులాబీ (100 పూలు) రూ.150
డచ్ (20పూలు) రూ.300
కనకంబరం (బారు-1) రూ.200
చిట్టిగులాబీ(కిలో) రూ.200
సెంటు గులాబీ(కిలో) రూ.200
కాగడాలు(కిలో) రూ.1,500
జాజులు(కిలో) రూ.1,000-రూ.1300
మల్లెలు(కిలో) రూ.2,000

ఆయుర్వేదం పూర్వీకులు ఇచ్చిన సంపద

ఆయుర్వేద వైద్యుడు గోపాలన్ రవీంద్రన్

'శ్రీ ప్రకాష్'లో ధన్వంతరి జయంతి



గోపాలన్ రవీంద్రన్‌ను సన్మానిస్తున్న ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు

తుని రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): పాయకరావుపేటలోని శ్రీ ప్రకాష్ ఆయుర్వేద ఆసుపత్రిలో ధన్వంతరి జయంతిని ఆదివారం నిర్వహించారు. ఈ వేడుకకు ఆధ్యాత్మిక వేత్త, ప్రవచన కర్త చాగంటి కోటేశ్వరరావు, ఆయుర్వేద వైద్యుడు డాక్టర్ కన్నాలయం గోపాలన్ రవీంద్రన్ హాజరయ్యారు. శ్రీ ప్రకాష్ ఆయుష్ రీసెర్చ్ ట్రస్టు వ్యవస్థాపకుడు సీహెచ్‌వీకే.నరసింహారావు, రామసీత దంపతులు ఆధ్వర్యంలో వేద పండితులు ధన్వంతరి హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. పెద్దఎత్తున విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరయ్యారు. కన్నాలయం గోపాలన్ రవీంద్రన్‌ను చాగంటి కోటేశ్వరరావు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రవీంద్రన్ మాట్లాడుతూ ఆయుర్వేదం పూర్వీకులు ఇచ్చిన గొప్ప సంపద అని, మనిషి ఆరోగ్యకరమైన జీవన విధానానికి దారి చూపే దిక్సూచిగా పేర్కొన్నారు. ప్రపంచ దేశాలు కూడా నేడు ఆయుర్వేద వైద్య ఆవశ్యకతను గుర్తించి తగిన ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. చాగంటి కోటేశ్వరరావు పుస్తకాల ప్రాముఖ్యతను వివరించారు. సుప్రసిద్ధ వ్యక్తుల జీవిత చరిత్రలు చదవడం ద్వారా జ్ఞాన ప్రాప్తి కలుగుతుందన్నారు. గురు ప్రాముఖ్యతను వివరిస్తూ గురువు అనే వారు స్వార్థంలేని విద్య అని విద్యార్థులు ఉన్నత స్థితికి చేరడాన్ని గురువు ఒక దిక్సూచి అని కొనియాడారు. శ్రీ ప్రకాష్ వ్యవస్థాపకుడు నరసింహారావు మాట్లాడుతూ ధన్వంతరి జయంతి రోజున ఆయుర్వేదంలో విశిష్ట సేవలు అందించిన వారిని సన్మానించడం ఆనందదాయకమని తెలిపారు. కార్యక్రమంలో ఆయుర్వేద ఆసుపత్రి ట్రస్టీ డాక్టర్ యు.ఇందూలాల్, సైకలాజికల్ కౌన్సిలర్ అపర్ణ శర్మ, శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్ ప్రకాష్, ఆయుర్వేద చికిత్సాలయ సలహాదారుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్, ప్రధాన వైద్యులు డాక్టర్ టి.రమేష్‌బాబు, డాక్టర్ ఏంఏ సుమయ్య, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేదిలో రయ్ రయ్...

బీచ్‌లో ఏటీవీ బైకులు

ఆనందం వ్యక్తం చేస్తున్న పర్యాటకులు



అంతర్వేది, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేది పుణ్యక్షేత్రం ఆధ్యాత్మికం, పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చెందుతుంది. రానున్న కార్తీక మాసం పురస్కరించుకుని లక్షలాది మంది భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున బీచ్‌లో ఎనిమిది ఏటీవీ బైకులను స్థానికులు సిద్ధం చేశారు. ఒక్కొక్కటీ రూ.3లక్షల ఖరీదు కలిగిన ఈ బైకులు పెట్రోల్‌తో నడుస్తాయి. పర్యాటకులు బైకులపై చక్కర్లు కొడుతూ సముద్రపు కెరటాల అలలను ఆస్వాదిస్తున్నారు. దుబాయ్ వంటి దేశాల్లో ఇసుకలో నడిచే ఈ ఏటీవీ బైకులు అంతర్వేది సముద్ర తీరంలో ఏర్పాటు చేయడంపై పర్యాటకులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



కోనసీమ జిల్లా అంతర్వేది బీచ్‌లో ఏటీవీ బైక్ వద్ద ఫోజులిస్తున్న పర్యాటకులు, బీచ్‌లో సిద్ధంగా ఉన్న ఏటీవీ బైకులు

అంబాజీపేటలో టిఫిన్ హోటల్ సీజ్

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి రామయ్య



హోటల్‌ను సీజ్ చేసి నోటీసు అతికిస్తున్న అధికారులు

అంబాజీపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేటలో ఫుడ్‌పాయిజన్ కారణంగా 20 మంది అస్వస్థతకు గురైన కారణంగా టిఫిన్ హోటల్‌ను సీజ్ చేసినట్టు జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి వై.రామయ్య తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలో ఉన్న పట్టాభిరామయ్య హోటల్‌ను ఆయన తనిఖీ చేసి శాంపిల్స్‌ను సేకరించారు. ఈ హోటల్‌లో టిఫిన్ తిని 20 మందికి పైగా అస్వస్థతకు గురై ఆసుపత్రిలో చేరిన విషయం విదితమే. హోటల్‌లో మినపప్పు, పంచాదార, ఉప్పు, మంచినీటి శాంపిల్స్‌ను కాకినాడకు పంపించామని, శాంపిల్స్ నుంచి వచ్చిన నివేదికను ఉన్నతాధికారులకు నివేదించడం జరుగుతుందని రామయ్య తెలిపారు. ఆ ప్రాంతంలో ఉన్న చికెన్‌షాపు, కిరణా షాపులను తనిఖీ చేశారు. చికెన్ షాపు వద్ద అపారిశుధ్యంగా ఉండడంతో యాజమానికి నోటీసు జారీ చేశారు. లైసెన్సు లేని దుకాణ యజమానులు ఫుడ్‌సేఫ్టీ అధికారుల నుంచి సర్టిఫికెట్ తీసుకోవాలని సూచించారు.

కుమారపురంలో అగ్నిప్రమాదం

రూ.5 లక్షల ఆస్తి నష్టం






కాలిపోయిన గృహోపకరణాలు

పిఠాపురం రూరల్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం కుమారపురంలో ఆదివారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో రూ.5లక్షల ఆస్తి నష్టం సంభవించింది. గ్రామంలోని మెయిన్‌రోడ్డును అనుకుని ఉన్న ఇంట్లో పి.సుజాత, ఆమె కుటుంబసభ్యులు నివాసముంటున్నారు. తెల్లవారుజాము సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గృహోపకరణాలు అన్నీ కాలిపోయాయి. ప్రమాదాన్ని గుర్తించి సుజాత, తన కుమారుడు కుమార్తె, మనుమరాలితో బయటకు రావడంతో సురక్షితంగా బయటపడ్డారు. పిఠాపురం అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అయితే విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఈ ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు.

పదిరోజుల క్రితం వివాహిత అదృశ్యం
పంటకాల్వలో మృతదేహం లభ్యం

పి.గన్నవరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన వివాహిత పదిరోజుల క్రితం అదృశ్యం కాగా పంటకాల్వలో శవంగా కనిపించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... పోతవరానికి చెందిన కోట లక్ష్మణరావుకు కొత్తపేట మండలం బిళ్లకుర్రు గ్రామానికి చెందిన పల్లవి (34)తో పదేళ్ల క్రితం వివాహమైంది. అప్పటి నుంచి పిల్లలు పుట్టకపోవడంతో వారి మధ్య తరుచూ గొడవలు జరుగుతూ ఉండేవి. గొడవలు సమయంలో పల్లవి సోదరుడు, తల్లి భార్యభర్తలకు సర్ది చెప్పేవారు. ఈ క్రమంలోనే పల్లవి తల్లి ఇటీవల పోతవరం రాగా ఈనెల 10న తల్లిని తీసుకుని బిల్లకుర్రు వెళ్లింది. తల్లిని విడిచి తిరిగి పోతవరం బయలుదేరిన ఆమె ఇంటికి రాలేదు. ఆదివారం ఉదయం ఆమె సోదరుడు బొంతు తుక్కులయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఆదివారం ఉదయం 11.30 సమయంలో అమలాపురం రూరల్ మండలం ఇందుపల్లి విప్పర్తివారిపేట పంటకాల్వలో లభ్యమైన మహిళ మృతదేహాన్ని పల్లవిగా ఆమె సోదరుడు తుక్కులయ్య గుర్తించాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ బి.శివకృష్ణ తెలిపారు.

వివాహిత అదృశ్యంపై కేసు



అశ్విని (ఫైల్)


ముమ్మిడివరం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): దేవాలయానికి వెళుతున్నానని చెప్పి ఇంటి నుంచి బయటికి వెళ్లిన వివాహిత అదృశ్యమైంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం గాలింక గ్రామానికి చెందిన యాళ్ల అశ్విని (27) శనివారం ఉదయం గుడికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులు ఇళ్ల వద్ద అశ్విని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టినా ఆమె ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఆమె భర్త మహేష్ ఆదివారం ముమ్మిడివరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ డి.జ్వాలాసాగర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆమె ఆచూకీ తెలిస్తే 9618955271, 9948471551, 9550329963కు సమాచారం అందించాలని కుటుంబ సభ్యులు కోరారు.

పొల్లూరు జలపాతం వద్ద పర్యాటకుల సందడి



మోతుగూడెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో ఉన్న పొల్లూరు జలపాతం వద్దకు ఆదివారం పర్యాటకులు తరలివచ్చి సందడి చేశారు. దారాలమ్మ గుడి పిక్నిక్ స్పాట్, పొల్లూరు పవర్ ప్లాంట్ సందర్శించారు. తర్వాత పుష్ప బ్రిడ్జి, అనంతరం ఫోర్ బై రిజర్వాయర్, డొంకరాయి డ్యామ్‌ను పర్యాటకులు సందర్శించారు.

రంగులే.. గోదారిలే..



గోదావరి గట్టు.. అందులోను సాయంత్రం. సూర్యుడు అస్తమించే సమయం... అప్పుడు రంగుల వర్ణంగా మారిన జలప్రవాహం... చూసిన కన్నులకు అందాలు సొంతం

-స్టాఫ్ ఫొటోగ్రాఫర్, రాజమహేంద్రవరం

దొరబాబుకు పలువురి పరామర్శ

కాట్రేనికోన,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి):మాతృవియోగంతో బాధపడుతున్న టీడీపీ సీనియర్ నాయకుడు రంభాల దొరబాబును ఆదివారం టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మెట్ల రమణబాబు, నల్లా స్వామి, జనసేన నాయకుడు కల్వకొలను తాతాజీ పరామర్శించారు. దొరబాబు తల్లి పార్వతీదేవి చిత్రపటానికి పలువురు నాయకులు నివాళులర్పించారు.

కమల్‌కు అభినందనలు

అమలాపురం రూరల్, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పేరూరులో జరిగిన రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో సమనస డిల్లీ పబ్లిక్ స్కూలులో చదువుతున్న కమల్‌లింగేశ్ ప్రతిభ చాటగా అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి అభినందించారు. బ్లాక్‌బెల్టు సాధించిన కమల్ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ప్రోత్సహించారు.

అంకితభావంతో పనిచేయాలి



నాగేంద్రను సన్మానిస్తున్న దృశ్యం

అమలాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వాకర్స్ అంతర్జాతీయ లక్ష్యాలను క్షుణ్ణంగా అర్థం చేసుకుని, వాటి సాధనకు క్లబ్ సభ్యులంతా క్రమశిక్షణతో పనిచేయడం ద్వారానే అంతర్జాతీయ వాకర్స్‌క్లబ్ అభివృద్ధి, విస్తరణ సాధ్యపడుతుందని ప్రొఫెసర్, అంతర్జాతీయ వాకర్స్‌క్లబ్ ఉపాధ్యక్షుడు డాక్టర్ గోకరకొండ నాగేంద్ర అన్నారు. అమలాపురంలోని వాకర్స్ హెల్త్‌క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని క్లబ్ పనితీరును సమీక్షించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈసందర్భంగా జరిగిన హెల్త్‌క్లబ్ సమావేశానికి వాకర్స్ హెల్త్ క్లబ్ అధ్యక్షుడు బోనం సత్యవరప్రసాద్ అధ్యక్షత వహించారు. క్లబ్ సభ్యులంతా సమైక్యంగా నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు అంకితభావంతో పనిచేసి మంచి గుర్తింపు పొందాలని నాగేంద్ర సూచించారు. కార్యక్రమంలోపాల్గొన్న డాక్టర్ విష్ణుమూర్తి, సభ్యులకు పలు ఆరోగ్య సూచనలు చేశారు. డాక్టర్ పీఎస్ శర్మ అంతర్జాతీయ 40వసంతాల లోగో బ్యాడ్జీలను ఆవిష్కరించారు. వాకర్స్ ఏరియా కార్యదర్శి నూకల సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు గోటేటి గంగాధరం, క్లబ్ కార్యదర్శి బూరగాయల శివరామకృష్ణ, కోశాధికారి పడాల నాయుడు, జిల్లా కోశాధికారి వలవల నాయుడు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల గోల్‌మాల్‌పై ఆందోళన

- జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు
- సర్పంచ్‌ను నిలదీసిన గ్రామస్తులు



సర్పంచ్‌ను నిలదీస్తున్న జనసేన నాయకుడు చిక్కం భీముడు, తదితరులు

ఉప్పలగుప్తం, అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): ఉప్పలగుప్తం పంచాయతీలో నిధుల గోల్‌మాల్‌పై రగడ జరుగుతోంది. వాటర్ వర్క్స్ పనుల్లో రూ.13లక్షలు దుర్వినియోగం జరిగినట్టు గ్రామస్తులు జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. మేజర్ పంచాయతీ ఉప్పలగుప్తంలో శివారు ప్రాంతాల ప్రజలు చాలాకాలంగా తాగునీటి కొరతను ఎదుర్కొంటున్నారు. ఇంటింటికీ కుళాయి పథకం ద్వారా తమ దాహార్తి తీరుతుందని గ్రామస్తులు ఆశించారు. అయితే తాగునీటి సమస్య తీరకపోగా నిధులు దుర్వినియోగం జరిగినట్టు, తక్షణం విచారణ జరిపి తమకు న్యాయం చెయ్యాలంటూ గ్రామస్తులు అధికారులను ఆశ్రయించారు. పనులు చేయకుండానే నిధులు స్వాహా చేశారంటూ గ్రామస్తులు సర్పంచ్‌పై ఆరోపణలు చేస్తున్నారు. రెండు రోజుల క్రితం ఇదే అంశంపై పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ కడిమి చిన్నవరాజును జనసేన నాయకుడు చిక్కం భీముడుతో సహా పలువురు నిలదీశారు. దుర్వినియోగం జరిగిన నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎమ్‌బుక్‌లో సంతకాలు చేసిన అధికారులు సమాధానం చెప్పాలన్నారు. ఉపసర్పంచ్ మోకా శ్రీనివాసరావుతో సహా పంచాయతీ సభ్యులు వాటర్ వర్క్స్ నిధుల విషయంలో సమాధానం చెప్పాలంటూ సర్పంచ్‌ను నిలదీశారు. గతంలో ఇక్కడ పనిచేసిన కార్యదర్శి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సురేష్ సహకారంతోనే నిధుల గోల్‌మాల్ జరిగిందని డీపీవోకు ఇచ్చిన ఫిర్యాదులో వివరించారు. అసలు పంచాయతీలో జరిగిన రోడ్ల నిర్మాణం, వాటర్ వర్క్స్ పనుల వివరాలు, చెల్లించిన సొమ్ముల గుట్టు తేలాలంటే పూర్తిస్థాయి దర్యాప్తు జరపాలని ఫిర్యాదులో కోరారు.

వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తా: అశోక్

యానాం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): 2026లో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో యానాం నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని స్థానిక ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు. శనివారం రాత్రి స్థానిక జీవీఎస్ గార్డెన్స్‌లో కార్యకర్తలు, నాయకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ ఇళ్ల పట్టాలు పంపిణీ చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈనెల23న అర్హుల జాబితా ప్రకటిస్తామన్నారు.

రోడ్లన్నీ జలమయం

మలికిపురం,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): శనివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయమయ్యాయి. పల్లపు ప్రాంతాలన్నీ ముంపునీటితో మునిగిపోయాయి. కొన్నిప్రాంతాల్లో కురిసిన వర్షానికి చేలు జలదిబ్బంధంలో చిక్కుకున్నాయి. గూడపల్లి, చింతలమోరి, పల్లిపాలెం, విశ్వేశ్వరాయపురం గ్రామాల్లో రోడ్లన్నీ జలమయం కావడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు.

అఖిలభారత యాదవ మహాసభ

- 11తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదం



మాట్లాడుతున్న సంఘ ప్రతినిధులు

యానాం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్రంలో 60లక్షలున్న యాదవులకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించేలా వచ్చే ఎన్నికల్లో యాదవ సామాజిక వర్గానికి 25 అసెంబ్లీ, 5ఎంపీ సీట్లు కేటాయించాలని అఖిలభారత యాదవమహాసభ డిమాండ్ చేసింది. ఆదివారం యానాంలో ఏపీ స్టేట్ అధ్యక్షుడు లాకా వెంగళరావు, పుదుచ్చేరి అధ్యక్షుడు మట్టా సురేష్ యాదవ్ అధ్యక్షతన అఖిల భారత యాదవ మహాసభ జరిగింది. ఈసందర్భంగాయాదవ కార్పొరేషన్‌కు రూ.2వేల కోట్లు బడ్జెట్‌లో కేటాయించాలని, అమరావతిలో యాదవభవన్ నిర్మాణం, నామినేటెడ్ పదవుల్లో ప్రాతినిధ్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ మహాసభ తీర్మానించింది. అనంతరం జాతీయ ప్రధానకార్యదర్శి నుర్తు నరేంద్ర యాదవ్, శ్రీకాకుళం జిల్లా ఎమ్మెల్సీ రామారావు, రామచంద్రయాదవ్, తూర్పుగోదావరి శాఖ అధ్యక్షుడు కుండల సాయికుమార్యాదవ్ మాట్లాడారు. కార్యక్రమంలో కోన గురవయ్య, పెనుగొండ దుర్గాబాబు, మట్లా పుల్లారావు, పుట్టి ఏడుకొండలు, ఏసుబాబు, మొండి సత్యనారాయణ, వీరబాబు, గంగుల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడి మృతి

సంతాపం తెలిపిన డీఈవో సలీంబాషా



మామిడికుదురు,అక్టోబరు19(ఆంధ్రజ్యోతి): లూటుకుర్రు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న కాగితాలపల్లి నరసింహారావు గుండెపోటుతో మరణించారు. యూటీఎఫ్‌లో వివిధ పదవులు నిర్వహించిన ఆయన మృతి యూటీఎఫ్‌కు తీరని లోటని జిల్లా కోశాధికారి సీహెచ్ కేశవరావు అన్నారు. ఉపాధ్యాయుడి భౌతికకాయానికి డీఈవో షేక్ సలీంబాషా పూలమాలలువేసి నివాళులర్పించారు. ఎంఈవోలు లక్ష్మీనారాయణ, వెంకన్నబాబు, యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు నివాళులర్పించారు.

ఆర్థిక సహాయం

మలికిపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): రోడ్డుప్రమాదంలో కాట్రేనిపాడులో నివశిస్తున్న అడబాల ఫణీంద్ర చెయ్యి విరిగింది. రాజోలు తెలగకాపు సంక్షేమ సంఘం రూ.10వేలు అందజేసింది.

కోటికాంతులు నింపే దీపావళి



అమలాపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పర్యావరణాన్ని పరిరక్షిస్తూ దీపావళి పండుగను ప్రజలంతా సుఖ సంతోషాలతో ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు కోరారు. ప్రజలకు నియోజకవర్గంలోని కూటమి శ్రేణులకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. ఈదీపావళి ప్రజల జీవితాల్లో కోటి కాంతులు నింపాలని ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా చీకటిని పారద్రోలుతూ వెలుగులు ఇచ్చే దీపావళిని ప్రతీ ఇంటా ఆనందంగా జరుపుకోవాలని ఆనందరావు కోరారు.

బాధితులకు వైసీపీ నాయకుల పరామర్శ

అంబాజీపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మాచవరం హోటల్‌లో టిఫిన్ తిని ఫుడ్‌పాయిజన్ అయి అస్వస్థకు గురై స్థానిక మెడ్‌యునైటెడ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను వైసీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, నియోజకవర్గ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాస్ ఆదివారం పరామర్శించారు. పీకే రావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, కొర్లపాటి కోటబాబు, మట్టపర్తి హరి పాల్గొన్నారు.

ప్రతి ఇంటా ఆనంద దీపాలు వెలగాలి



పి.గన్నవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళి ప్రజల జీవితాల్లో చీకటిని పారద్రోలి కోటి కాంతులు నింపాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ఆకాంక్షించారు. చెడుపై మంచి సాధించిన విజయానికి చిహ్నంగా, దుష్టశక్తులపై దైవశక్తి సాధించిన విజయానికి ప్రతీకగా జరుపుకునే దీపావళిని నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఇంటా సిరులు కురిపించాలని, సకల సంపదలు, సౌభాగ్యాలు కలగాలని, ప్రతి ఇంటా ఆనందదీపాలు వెలగాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ముమ్మిడివరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి):జిల్లా ఎయిడ్స్ నియంత్రణ, నివారణ సంస్థజనకల్యాణ్ వెల్ఫేర్ సొసైటీప్రివెన్షన్ యూనిట్ ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని పలు ప్రాంతాల్లో ఎయిడ్స్, హెచ్‌ఐవీపై అవగాహన కల్పించారు. ఐఈసీ, ఎల్ఈడీ వ్యాన్ ద్వారా సీహెచ్ గున్నేపల్లి, బొండాయికోడు, అన్నంపల్లి, ముమ్మిడివరం మార్కెట్ సెంటర్, బాలికల వసతిగృహ ఆవరణ, మహిపాలచెరువు సెంటర్, రాణేలంక, మురమళ్ల సెంటర్లలో సంచార మొబైల్‌వ్యాన్ ద్వారా డిజిటల్ స్ర్కీన్‌పై హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కల్పించారు. ఎల్ఈడీ వ్యాన్‌తో ఆడియో, వీడియో దృశ్య మాధ్యమంతో అవగాహన కల్పించారు. మెండి కమల, గొల్లపల్లి గోపీ పాల్గొన్నారు.

ఆనందంగా దీపావళిని జరుపుకోవాలి

మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): దీపావళిని ప్రజలు ఆనందంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. నియోజకవర్గ ప్రజలకు ఆయన దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): దీపావళిని ఆనందంగా జరుపుకోవాలని అంగర ఎస్‌ఐ హరీష్‌కుమార్ ఆకాం క్షించారు. ఆదివారం అంగర పోలీస్‌స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అంగర పోలీస్‌ స్టేషన్ పరిధిలో 7 బాణసంచా షాపులకు తాత్కాలిక లైసెన్స్‌లు ఇచ్చామన్నారు. బాణసంచా షాపుల వద్ద భద్రతా చర్యలు తీసుకోవాలని వ్యాపారులకు సూచించామ న్నారు. బాణసంచా పాత స్టాక్‌ను ఇంటిలో పెట్టుకున్న ఇద్దరిపై కేసు నమోదు చేశామన్నారు. ప్రజలు బాణసంచా కాల్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

పునరుత్పాదక రంగానికి జీఎస్టీ తగ్గింపు ఎంతో మేలు


వాడపాలెంలో బైక్ ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

కొత్తపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): పునరుత్పాదక రంగానికి జీఎస్టీ తగ్గింపు ఎంతో మేలు అని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. సౌరశక్తి పరికరాల వినియోగంపై అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ నిర్వహించిన బైక్ ర్యాలీని వాడపాలెంలో ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సోలార్ ఎనర్జీని వినియోగించే రైతులు, గృహ వినియోగదారులకు మంచి ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఇంటి పైకప్పుపై సోలార్ యూనిట్లను ఏర్పాటు చేసుకోవడం ద్వారా విద్యుత్ బిల్లుల భారాన్ని తగ్గించుకోవచ్చునన్నారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ డీఈ డి.చిట్టిరాజు, ఏఈలు రామకృష్ణ, టి.నరేష్, డి.అశోక్, సిబ్బంది పాల్గొన్నారు.

అనారోగ్య బాధితుడికి ఆర్థికసాయం

ఆత్రేయపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆత్రేయపురం మండలం ఉచ్చిలికి చెందిన సిద్ధగని చంద్రయ్య కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈయన భార్య క్యాన్సర్‌తో బాధపడుతోంది. ఇది తెలుసుకున్న ఉచ్చిలికి చెందిన ముదునూరి వీరబాబు కుటుంబ సభ్యులు వారిని పరామర్శించి రూ.25వేలు ఆర్థికసాయం అందించారు. వారిద్దరికి మెరుగైన వైద్యం చేయిస్తానని వారు హామీ ఇచ్చారు.

చల్లా లక్ష్మికి నివాళి

మండపేట అక్టోబరు,19(ఆంధ్రజ్యోతి) మండపేట పట్టణంకు చెందిన ప్రముఖ హోమియోవైద్యులు జనవిజ్ఞానవేదిక రాష్ట్రనాయకులు డాక్టర్ చల్లా రవి కూమార్ స్వర్గీయ చల్లాలక్ష్మీ సంతాప సభ ఆదివారం మండపేట రైస్‌మిల్లర్స్‌భవనంలో జరిగింది.ఈసందర్బంగా లక్ష్మీ చిత్రపటాని వామపక్షనేతలు పలువురు ప్రముఖులు నివాళలు అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ మాట్లాడుతూ అమ్మఅనే పధానికి అక్షరరూపం స్వర నిరాజనం పలికిన డాక్టర్ రవికూమార్‌ను ప్రశంసించారు..ప్రజానాట్యమండలి ఆద్వర్యంలో గీతాలను అలపించారు.ఈకార్యక్రమంలో చల్లాలక్ష్మీ వ్యక్తిత్వం అమె చేసిన త్యాగం గురించి పలువురు వక్తలు ప్రసంగించారు. కార్యక్రమంలో నిర్వాహకులు డాక్టర్ రవికూమార్, లక్ష్మీ మోహర్ ప్రసన్నలతోపాటు ప్రముఖులు దడాలసుబ్బారావు, యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ప్రబాకరవర్మ, సుబ్బారావు, తాపేశ్వరం సురుచిఫుడ్స్ అదినేత మల్లిబాబు, సత్తిరాజు, అభ్యుదయ రచయితలసం జిల్లాఆద్యక్షుడు గండిస్వామిప్రసాద్, ప్రజానాట్యమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


కె.గంగవరం మండలం పామర్రులో బాణసంచా విక్రయ కేంద్రాలు


కపిలేశ్వరపురం: అంగరలో వెలవెలపోతున్న బాణసంచా దుకాణాలు


రావులపాలెంలో పక్కపక్కనే ఏర్పాటు చేసిన బాణసంచా షాపులు

ముసురుతో మందకొడిగా బాణసంచా విక్రయాలు

• వాతావరణం మార్పుతో వ్యాపారుల గగ్గోలు • ఇలాగైతే నష్టపోతామని ఆవేదన

కె.గంగవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత నుంచి ఆదివారం ఉదయం వరకు భారీ వర్షం కురిసింది. అంతే కాకుండా ఆదివారం ఉదయం నుంచి ముసురు వాతావరణం కొనసాగుతోంది. దీంతో బాణసంచా విక్రయ కేంద్రాలు వెలవెలపోతున్నాయి. మండలంలోని పామర్రులో 4, గంగవరంలో 7, దంగేరులో ఒక షాపులో బాణసంచా విక్రయాలకు వ్యాపారులు తాత్కాలిక లైసెన్సులు తీసుకున్నారు. వీరు ఆది, సోమవారాల్లో విక్రయాలు జరుపుకోవాల్సి ఉంది. ఇటీవల రాయవరంలో జరిగిన ఘటనతో ఈ సారి బాణసంచా విక్రయాలను గ్రామాలకు దూరంగా ఏర్పాటు చేశారు. దీనికి తోడు ముసురు వాతావరణం వాటి విక్రయాలపై పడింది. ఆదివారం వాటి అమ్మకాలు అంతంత మాత్రంగా జరిగాయి. సోమవారం నాడు వాతావరణంలో మార్పులు వచ్చి ఎండ కాస్తే వాటి విక్రయాలు జరుగుతాయి. పండుగ నాడు కూడా ముసురు వాతావరణం ఉంటే నష్టపోతామని వ్యాపారులు వాపోతున్నారు.

వెలవెలపోతున్న దుకాణాలు

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగర, టేకి, కోరుమిల్లి, కపిలేశ్వరపురం గ్రామాల్లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు వెలవెలబోయాయి. వాటి నిర్వహణకు అధికారులు రెండు రోజులే లైసెన్స్‌లు జారీ చేయడంతో కనీసం పెట్టుబడి వస్తుందా అనే ఆందోళనలో దుకాణదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ముసురు వాతావరణం బెంబేలెత్తిస్తున్నది. గత ఏడాది కంటే వాటి ధరలు 30 శాతం పెరగడంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కనీసం పెట్టుబడి వస్తే చాలని దుకాణదారులు అంటున్నారు.


మండపేటలో కొనుగోలుదారులు లేక వెలవెలబోతున్న దృశ్యం

కన్పించని నిబంధనలు

రావులపాలెం, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): బాణసంచా దుకాణాల ఏర్పాటులో ఎక్కడా నిబంధనలు పాటించడం లేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏదో మొక్కుబడిగా నిబంధనలు పాటిస్తూ శనివారం మధ్యాహ్నం నుంచి ఆయా ప్రాంతాల్లో అమ్మకాలు సాగిస్తున్నారు. ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదని పలు వురు ఆరోపిస్తున్నారు. ఇటీవల రాయవరం శివారులో జరిగిన బాణసంచా ప్రమాదంలో 10 మంది మృతి చెందిన ఘటన తెలిసిందే. దీంతో నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా బాణసంచా తయారు చేసినా లేదా దుకాణాల ఏర్పాటులో నిబంధనలు పాటించక పోయినా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానిక అధికారులకు ఆదేశాలు జారీ చేశా రు. రావులపాలెంలో ఏర్పాటు చేసి న దుకాణాల వద్ద కనీస నిబంధనలు పాటించకుండా ఏర్పాటు చేసినా, అధికారులు చోద్యం చూస్తు న్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత చర్యలు చేపట్టడం కంటే అవి జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కొనుగోలుదారులులేక...

మండపేట (ఆంధ్రజ్యోతి): పట్టణంలో వున్న ప్రభుత్వ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు ఆదివారం కొనుగోలుదారులులేక వెలవెలబోయాయి. వాటి ధరలు పెరిగిపోవడంతో బాణసంచా సామాన్లు కొనుగోలుకు ప్రజలు వెనుకంజ వేస్తున్నట్టు తెలిసింది. బాణసంచా దుకాణాలకు సంబంధించి ఒకరోజు ముందు మాత్రమే అనుమతులు ఇచ్చారు. కేవలం రెండు రోజులపాటు విక్రయాలు చేసుకునేలా అధికారులు అనుమతులు ఇచ్చారు. పోలీసుల అంక్షల మధ్య బాణసంచా దుకాణాల వద్ద విక్రయాలు మందకొడిగా సాగుతున్నట్టు వ్యాపారులు వ్యాఖ్యానిస్తున్నారు.

కుల వైషమ్యాలను రెచ్చగొట్టడం వైసీపీకి అలవాటు

కొత్తపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కులాల మధ్య వైషమ్యాలను పెంచడం వైసీపీకి దినచర్యగా మారిందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎం.బాబ్జి అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ కులాల కుంపట్లను రాజేయడం ద్వారా రాష్ట్ర ప్రగతిని అడ్డుకోవాలని చూస్తున్నదన్నారు. ప్రజలు ప్రతీది గమనిస్తున్నారన్నారు.

సంక్షేమమే కాదు..అభివృద్ధిలోనూ

కూటమి ప్రభుత్వానిదే అగ్రస్థానం

ఎమ్మెల్యే బండారు


పెదపళ్లలో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండారు

ఆలమూరు, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు అమలులోనే కాదు...అభివృద్ధి పనులు చేయడంలోనూ కూటమి ప్రభుత్వం అగ్రస్థానంలో నిలుస్తున్నదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఆలమూరు మండలం సంధిపూడి, పినపళ్ల, పెదపళ్ల గ్రామాల్లో పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. పెదపళ్లలో నిర్మించిన అభివృద్ధి పనులతో పాటు, సంధిపూడి, పినపళ్ల గ్రామాల్లో పలు సీసీ రోడ్లను ఆదివారం ఆయన ప్రారంభించారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్ని విధాలుగా విధ్వంసం చేసిందని ఎమ్మెల్యే అన్నారు. రాష్ట్రం వైపు పారిశ్రామికవేత్తలను ఆకర్షించేలా చేయడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండారు శ్రీనివాస్, ఎంపీడీవో ఎ.రాజు, సంధిపూడి, పినపళ్ల, పెదపళ్ల సర్పంచ్‌లు తోట భవాని, సంగిత సుభాష్, యేడిద సత్యశ్రీమెహర్, నాయకులు ఈదల నల్లబాబు, సలాది నాగేశ్వరరావు, దొడ్డా సుబ్బారావు, వంటిపల్లి సతీష్, జాస్తి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.


వాడపల్లి ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్న భక్తులు

వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు

ఆత్రేయపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. స్వామివారిని కొత్తపేట ఆర్డీవో పి.శ్రీకర్ దంపతులు దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపారు. వేద పండితుల ఆశీర్వచనం తీసుకుని స్వామివారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు. ఆలయంలో చేపడుతున్న నిత్యాన్నదాన పథకానికి ఆలమూరు మండలం చొప్పెల్ల గ్రామానికి చెందిన తోట సూరిబాబు, నాగలక్ష్మి దంపతులు రూ.50,116 విరాళం అందించారు. శనివారంతో బ్రహ్మోత్సవాలు ముగియడంతో ఆదివారం నుంచి స్వామివారి ఆర్జిత సేవలు యథావిధిగా కొనసాగాయి. వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా వచ్చిన భక్తజనం స్వామివారిని దర్శించుకుని అన్నప్రసాదంలో పాల్గొన్నారు.


ఆర్డీవో శ్రీకర్ దంపతులకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న దృశ్యం

ఎమ్మెల్యే బండారుకు సత్కారం

ఆత్రేయపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేట డివిజన్‌స్థాయి విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యులుగా కముజు శ్రీను, కొమ్మర శ్రీనివాస్ ఎంపిక అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు సత్యానందరావును ఎంఆర్పీఎస్ నాయకులు సత్కరించారు. కమిటీ సభ్యులతో ఎమ్మెల్యేను కలిసి ఆయన్ను సత్కరించారు.


సత్యసాయి మందిరంలో పలు రంగాల్లో సేవలందించిన మహిళలను సత్కరించిన దృశ్యం

మహిళలకు సత్కారం

కొత్తపేట, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): కొత్తపేట శ్రీ సత్యసాయిబాబా మందిరంలో ఆదివారం వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలను సర్పంచ్ బూసి జయలక్ష్మి ఆధ్వర్యంలో సత్కరించారు. భగవద్గీతలో గణపతి సచ్చినందస్వామితో బంగారు పతకం పొందిన కంచర్ల రాధాకుమారి, ఎస్.భార్గవి, అడిషనల్ డీఎంహెచ్‌వో ఎం.సుమలత, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఏఎస్ఎస్ రమాదేవిలను సత్యసాయి సంస్థ తరపున సత్కరించారు. కార్యక్రమంలో సత్యసాయి మందిర కన్వీనర్ కంకటాల సత్యనారాయణమూర్తి, సత్యవరపు భాస్కరం, చొప్పెర్ల రాంబాబు, బూసి భాస్కరరావు, చింతం రామకృష్ణ, కంచర్ల రాజా, ఏ.రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ కమిషన్ కార్యదర్శిగా ముదునూరి



ఆత్రేయపురం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): వాలీబాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అథ్లెటిక్స్ కమిషన్ కార్యదర్శిగా ముదునూరి రామకృష్ణంరాజు ఎంపికయ్యారు. ఆత్రేయపురం మం డలం తాడిపూడికి చెందిన ఈయన హైద రాబాద్‌లో కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్స్ జీఎస్టీ ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈయన గ్రామీణస్థాయి నుంచి అంత ర్జాతీయ వాలీబాల్ క్రీడాకారుడిగా ప్రతిభ కనబరుస్తున్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ జట్టుకు కోచ్‌గా సేవలందిస్తూ వాలీబాల్, బీచ్‌వాలీబాల్‌లకు కీర్తిని తీసుకువస్తున్నారు.


మహిళకు ఆర్థికసాయం అందజేస్తున్న మంత్రి సుభాష్

మహిళకు ఆర్థికసాయం

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): ఆర్థిక ఇబ్బందులతో ఉన్న మహిళకు మంత్రి సుభాష్ ఆర్థికసాయం అందించారు. పి.గన్నవరం మండలం ముక్తేశ్వరం గ్రామానికి చెందిన జనిపల్లి సంధ్య, భర్తను కోల్పోయి పిల్లలతో ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతోంది. ఇది తెలుసుకున్న మంత్రి వారి కుటుంబాన్ని పరామర్శించి తక్షణ సాయంగా రూ.15 వేలు ఆర్థికసాయం అందజేశారు. పిల్లల చదువుకు తోడ్పాటునందిస్తానని ఆయన భరోసా ఇచ్చారు.

ట్రావెల్ బస్సులపై కేసు నమోదు

రావులపాలెం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకుండా జాతీయ రహదారిపై ప్రయాణిస్తున్న ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేసినట్టు జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో రావులపాలెం జాతీయ రహదారిపై ప్రత్యేక తనిఖీలు జరిపారు. ఈ తనిఖీల్లో 27 ట్రావెల్ బస్సులపై కేసులు నమోదు చేసి రూ.88,900 జరిమానా విధించినట్టు ఆయన తెలిపారు. ఈ తనిఖీల్లో రావులపాలెం ఎంవీఐ ఓలేటి శ్రీనివాస్, అసిస్టెంట్ ఎంవీఐ షణ్ముక శ్రీనివాస్, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ సంతకాల సేకరణ

కె.గంగవరం, అక్టోబరు 19(ఆంధ్రజ్యోతి): యండగండిలో ఆదివారం వైసీపీ నాయకులు మెడికల్ కాలేజీల అంశంపై కోటి సంతకాల సేకరణ చేపట్టారు. వైసీపీ నాయకుడు సాదే నారాయణరావు ఆధ్వర్యంలో కార్యకర్తలు మెడికల్ కళాశాలల వ్యవహారంపై పార్టీ పంపిన కరపత్రాలు పంపిణీ చేశారు